

సబ్‌జైలు పరిశీలన

తెనాలిరూరల్: తెనాలి సబ్‌జైలును రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత శనివారం పరిశీలించారు. జైలు ఆవరణను పరిశీలించి ఖైదీల వసతుల గురించి ఆరాతీశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 2423 క్యూసెక్కులు విడుదల చేశారు.



దుర్గమ్మ సేవలో విద్యావతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి వి.విద్యావతి శనివారం ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

మల్లేశ్వరుని సన్నిధిలో హైకోర్టు జడ్జి



పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వి.గోపాలకృష్ణారావు దంపతులు శనివారం దేవస్థానానికి విచ్చేశారు. అధికారులు, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావు, ఆలయ అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చారణ, మేళ తాళాలతో హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు స్వాగతం పలికారు. న్యాయమూర్తి దంపతులు భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు.

పీజీఎస్ సర్టిఫికేషన్‌పై అవగాహన



తెనాలి: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పీజీఎస్ ఇండియా ఆర్గానిక్ సర్టిఫికేషన్ తీసుకోవటం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయని సుస్థిర వ్యవసాయ కేంద్రం(సీఎస్ఏ) రాష్ట్ర కో-ఆర్డినేటర్ లక్ష్మి కన్నెగంటి అన్నారు. కొల్లిపర మండంలోని దావులూరు, అత్తోట, తూములూరు, చక్రాయపాలెం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పంట భూములను శనివారం ఆమె సందర్శించారు. సేంద్రియ ధ్రువీకరణ విధానం, పీజీఎస్ ఇండియా ఆర్గానిక్ సర్టిఫికేషన్ పొందటానికి తీసుకోవలసిన చర్యలను గురించి రైతులకు వివరించారు. తగిన సలహాలు, సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయ విభాగం మార్కెటింగ్ అండ్ సర్టిఫికేషన్ ఎస్ఎఫ్ఏ సుమ, జిల్లా అగ్రి అడ్వయిజర్ బోర్డు మెంటర్ జి.శ్రీధర్, సిబ్బంది నాగజ్యోతి, పరిశుద్ధకుమారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధుడి దారుణ హత్య

గొంతు కోసి పరారైన గుర్తుతెలియని వ్యక్తులు



గురజాల: వృద్ధుడి గొంతు కోసి హత్య చేసిన సంఘటన మండలంలోని కొత్తఅంబాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పత్తి రామారావు (73)ను గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిలో గొంతు కోసి హత్య చేశారు. మృతుడి భార్య హైదరాబాద్‌లో ఉంటుండగా, ఇద్దరు సంతానం అమెరికాలో నివాసం ఉంటున్నట్లు సమాచారం. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని డీఎస్పీ పల్లపురాజు, సీఐ బాలకృష్ణ, ఎస్ఐలు అశోక్, బి.అనంత కృష్ణలు పరిశీలించారు. డీఎస్పీ పల్లపురాజు మాట్లాడుతూ హత్య ఎవరూ చేశారు.. కారణాలు ఏమిటి అన్న విషయాలను విచారించనున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం రామారావు మృతదేహాన్ని గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు.

రేపు కుల గణనపై ప్రాంతీయ సదస్సు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 20వ తేదీన విజయవాడలో కుల గణన - 2023 పై ప్రాంతీయ సదస్సు జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. సదస్సు ఏర్పాట్లపై కలెక్టర్ శనివారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్టెల్లా కళాశాల సమీపంలోని మెట్రోపాలిటన్ హోటల్‌లో ప్రాంతీయ సదస్సు జరుగుతుందన్నారు. ఎన్టీఆర్ జిల్లాతోపాటు కృష్ణా, బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు హాజరవుతారన్నారు.

అక్రమాలపై ఉక్కుపాదం

- ఇసుక, బుసక, గ్రావెల్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట
- గ్రానైట్ అక్రమ తరలింపుపై నిఘా
- రూ.8.91 కోట్ల అపరాధ రుసుం విధించిన మైనింగ్ విభాగం
- పలువురిపై కేసులు నమోదు
- ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వారిపై చర్యలు



ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న ప్రాంతాలను పరిశీలిస్తున్న మైనింగ్, పోలీస్ అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అక్రమరవాణాపై జిల్లా భూగర్భ గనుల శాఖ కన్నెర్ర చేసింది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆశాఖ అధికారులు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే క్రమంలో కఠిన చర్యలకు దిగారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకొని అపరాధ రుసుం విధిస్తున్నారు. కేసులు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు చేపడుతున్నారు.

విస్తృత తనిఖీలు..

అంతకు మునుపే సంబంధిత క్వారీల పరిధిలో అక్రమంగా తరలిపోయిన ఇసుక, బుసక, గ్రావెల్, మట్టి తదితర వాటిని క్యూబిక్ మీటర్లలో లెక్కలు గట్టి ఆ వివరాల ప్రకారం అపరాధ రుసుం విధించినట్లు భూగర్భ, గనులశాఖ అధికారులు తెలిపారు. అపరాధ రుసుం చెల్లింపు కోసం మైనింగ్ విభాగం అధికారులు క్వారీ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. ఇదికాకుండా విస్తృత తనిఖీలు చేసి పలు వాహనాలను పట్టుకొని రూ.లక్షల్లో అపరాధ రుసుం విధించారు.

రూ.లక్షల్లో అపరాధ రుసుం...

జిల్లా పరిధిలో రేపల్లె, వేమూరు, బాపట్ల, అద్దంకి, పర్చూరు, చీరాల ప్రాంతాలనుంచి గ్రానైట్‌తో పాటు గ్రావెల్, మరం, మట్టి, మెటల్, సిలికా, ఇసుక, బుసక తదితర వాటిని రవాణా చేస్తున్నారు. అయితే చాలామంది ప్రభుత్వానికి రాయల్టీ, జీఎస్టీలు చెల్లించి వీటిని తరలిస్తున్నా కొందరు వీటిని అక్రమ రవాణా చేస్తూ పెద్దఎత్తున దండుకుంటున్నారు. దీనిపై మైనింగ్ అధికారులు నిఘా పెట్టారు. సమాచారం వచ్చిన వెంటనే అలెర్ట్ అయి దాడులుచేసి వాటిని పట్టుకొంటున్నారు. వాహనాలపై కేసులు నమోదు చేయడంతోపాటు అక్రమంగా తరలించిన క్వాంటిటీని లెక్కగట్టి ఆ మేరకు సంబంధిత వ్యక్తులకు అపరాధ రుసుం విధిస్తున్నారు. ఇటీవల మైనింగ్ అధికారులు సుమారు రూ.9 కోట్లు అపరాధ రుసుం విధించారు. అద్దంకి పరిధిలోని రామాయపాలెం వద్ద రూ.69 లక్షలు అపరాధ రుసుం విధించగా చీరాల మండలం గవినివారిపాలెం పరిధిలో రూ.6.59 కోట్లు, ఇదే మండల పరిధిలోని తోట వారిపాలెం పరిధిలో రూ.1.45 కోట్లు, కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం పరిధిలో రూ.8.62 లక్షలు, కర్లపాలెం గ్రామం పరిధిలో రూ.89,145, కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెంలో రూ.6.33 లక్షలు, టి.చుందూరు మండలం వేటపాలెం గ్రామ పరిధిలో రూ.70, 409, చినగంజాం మండలం మూలగానివారిపాలెం పరిధిలో రూ.99,792 అపరాధ రుసుం విధించారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట..



జిల్లాలో గ్రానైట్‌తోపాటు ఇసుక, బుసక, గ్రావెల్ తదితర వాటి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకొని అపరాధ రుసుం విధించాం. దీంతోపాటు జిల్లాలోని పదిచోట్ల ఇసుక, బుసక అక్రమరవాణాను గుర్తించి దాదాపు రూ.9 కోట్లు అపరాధ రుసుం విధించడం జరిగింది.

– రాజేష్, జిల్లా మైనింగ్ అధికారి

'వికసిత్ భారత్'ను జయప్రదం చేయాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: వికసిత్ భారత్ సంకల్ప యాత్రను జిల్లాలో జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం వీడియో సమావేశం ద్వారా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై పట్టణ, గ్రామాలలో విస్తృతమైన ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 26 నుంచి జనవరి 26వ తేదీవరకు జిల్లాలోని 459 పంచాయతీలలో యాత్ర సాగుతుందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నాలుగు వాహనాలు జిల్లాకు వస్తున్నాయని చెప్పారు. జిల్లాస్థాయిలో 37 మంది అధికారులతో ప్రత్యేక కమిటీ నియమించామన్నారు. అదే మాదిరిగా మండల స్థాయిలోనూ ఎంపీడీఓలు కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలోనూ 17 మందితో కమిటీ నియమించాలన్నారు. వలంటీర్ల ద్వారా ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. ఇదే క్రమంలో లబ్ధిదారులతోనూ అధికారులు మాట్లాడాలని తెలిపారు. వారంలో 14 గ్రామ పంచాయతీలలో యాత్ర సాగేలా అధికారులు సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

3700 పక్కా గృహాల నిర్మాణం లక్ష్యం..

జగనన్న కాలనీలలో 3,700 పక్కా గృహాల నిర్మాణం లక్ష్యాలను అధికారులు చేరుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. ప్రతిరోజు గృహ నిర్మాణాలపై అధికారులతో ఆర్డీఓలు సమీక్షించుకోవాలన్నారు. రేపల్లె, చిన గంజాం, అద్దంకి మండలాలలో పురోగతి లేకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. మార్టూరు, కోనంకిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రాధాన్యతా భవనాల నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీలలో 153 మౌలిక సదుపాయాల పనులలో కేవలం 23 పనులే పురోగతిలో ఉండడం ఏమిటని అధికారులను నిలదీశారు. పంచాయతీరాజ్ ఇంజినీర్ల పనితీరు మెరుగుపడాలని చెప్పారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీలో విచారణ పూర్తిచేసిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో పోలింగ్ స్టేషన్‌లలో కనీస సౌకర్యాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ అర్జున్ రావు, డీపీఓ డి.రాంబాబు, వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎస్.విజయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్, పీఆర్ ఎస్ఈ హరే రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

13 చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్ట్

రూ.20 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

నందిగామ: తరచూ పలు ప్రాంతాలలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను నందిగామ పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.20 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి శనివారం నందిగామ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ జనార్దన్ నాయుడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చీరాలకు చెందిన షేక్ అల్తాఫ్ ఏడవ తరగతి వరకు చదువుకున్నాడు. కూలి పనులు చేసుకుంటూ జీవించే అల్తాఫ్ కొంతకాలంగా జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. చోరీ కేసులో జైలులో ఉన్న సమయంలో కంచికచర్లకు చెందిన మణికంఠ అల్తాఫ్‌కు పరిచయమయ్యాడు. వారిద్దరూ కలిసి నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో 4, జగ్గయ్యపేట స్టేషన్ పరిధిలో 1, వత్సవాయి పోలీస్ స్టేషన్ పరిధిలో 1, కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 1, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో 1, తెలంగాణ రాష్ట్రం కోదాడ పోలీస్ స్టేషన్ పరిధిలో 2, నేలకొండపల్లిలో 1, ఖమ్మం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, హస్తినాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం చొప్పున మొత్తం 13 చోట్ల తాళం వేసి ఉన్న ఇళ్లు, దుకాణాలలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఆయా చోరీలలో వారు దొంగిలించిన 156 గ్రాముల బంగారు ఆభరణాలు, 8.820 కేజీల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు చోరీలకు ఉపయోగించిన కారు, బైకులతో పాటు వారి వద్ద నుంచి రూ.40 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాటి మొత్తం విలువ రూ.20 లక్షల వరకు ఉంటుందని ఏసీపీ తెలిపారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో...

గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై

ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 2వ తేదీన గుంటూరులో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్–1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www. sakshieducation. com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం అందరికీ తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత..

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గారు గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్ 1,2 పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపగలరు.

అవగాహన సదస్సు తేదీ
డిసెంబర్ 2, 2023(శనివారం)

వేదిక	సమయం
ఆంధ్ర క్రిస్టియన్‌ కాలేజీ (ఏసీ కాలేజీ), గవర్నమెంట్ ఆసుపత్రి పక్కన, సాంబశివ పేట, మెయిన్ రోడ్, గుంటూరు	ఉదయం 9.30 నుంచి 12.30 వరకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 8977625795

భారీ స్క్రీన్‌పై ప్రపంచ కప్ ఫైనల్ పోరు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): వన్‌డే ప్రపంచ కప్ క్రికెట్ పోరును భారీ స్క్రీన్‌పై వీక్షించే అవకాశాన్ని కల్పిస్తున్నామని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దాసరి రమేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1:30 నుంచి మ్యాచ్ ముగిసే వరకు స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకులగుంట క్రీడా మైదానంలో 15 అడుగుల వెడల్పు 10 అడుగుల పొడవు వున్న ఎల్ఈడీ స్క్రీన్‌తోపాటు కూర్చుని వీక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రవేశం ఉచితమని చెప్పారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ క్రికెట్‌ను మరింత ప్రోత్సహించేందుకు ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమకాలువకు 5,297, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,440, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 841.00 అడుగుల వద్ద ఉంది.

రోడ్డు భద్రత, నియమాలపై అవగాహన

బాపట్ల టౌన్: జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో శనివారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా, బ్లాక్ స్పాట్స్‌లో పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తూ, రోడ్డు భద్రత నియమాలు గురించి వాహనచోదకులకు అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వల్ల ఉపయోగాల గురించి తెలియజేశారు. ట్రిపుల్ రైడింగ్ వల్ల అనర్థాలను వివరించారు. మైనర్లు వాహనం నడుపుతూ రోడ్డు ప్రమాదానికి కారణమైతే అతడితో పాటు వాహన యజమానిని కూడా ముద్దాయిగా పరిగణిస్తామని హెచ్చరించారు.

బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ పి.రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్ల: బాపట్లను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. జిల్లా స్థాయి బాలల సంరక్షణ కమిటీ సమావేశాన్ని శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నుంచి బాలలకు విముక్తి, పునరావాసం కల్పించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని చెప్పారు. జాతీయ బాలల సంరక్షణ కమిటీ ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీని నియమించామని పేర్కొన్నారు. ఈనెల 20 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా టాస్క్ ఫోర్స్ కమిటీ విస్తృతంగా తనిఖీలు చేయాలని ఆయన ఆదేశించారు. 14 సంవత్సరాల్లోపు చిన్నారులంతా పాఠశాలలోనే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. చిన్నారులు బడి బయట లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. 14 నుంచి 18 సంవత్సరాల్లోపు కౌమార దశలోని బాలబాలికలు బాల కార్మిక వ్యవస్థకు గురిగాకుండా చూడాలని చెప్పారు. నిర్బంధంగా పని చేయించడం చట్టరీత్యా నిషేధమని తెలిపారు. ప్రమాదకరమైన పరిస్థితుల్లో బాలలు పని చేయడం నేరంగా పరిగణించాలని కలెక్టర్ రంజిత్ బాషా సూచించారు. తహసీల్దార్లు వారి పరిధిలోని మండలాలలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. అధికారులంతా మానవతా దృక్పథంతో పని చేయాలని ఆయన కోరారు. బాల కార్మికులుగా ప్రభావితమయ్యే ప్రాంతాల్ని ప్రాథమికంగా గుర్తించామన్నారు. బాపట్ల జిల్లాలో అధికంగా పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో మార్టూరు, చీరాల, బల్లికురవ, బాపట్ల మండలాలు ఉన్నాయని వెల్లడించారు. ఇటుక బట్టీల తయారీలో అద్దంకి, కొల్లూరు మండలాలు ఉండగా, చేపలు, రొయ్యల హేచరీలు బాపట్ల, నిజాంపట్నం, చీరాలలో ఉన్నాయని తెలిపారు. జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు వేటపాలెంలో, గనులు, క్వారీలు బల్లికురవ, మార్టూరు, పత్తి పరిశ్రమలు పర్చూరు, ఇంకొల్లు మండలాల్లో ఉన్నాయని తెలిపారు. జాతీయ రహదారిపై దాబాలు, పట్టణాలలో హోటళ్లు, షాపులలో తనిఖీలు చేయాలని అధికారులకు సూచించారు. తల్లిదండ్రులు లేని అనాథలు, తల్లి లేదా తండ్రి లేని పాక్షిక అనాథలు ఉంటే వారిని ఆనంద నిలయంలో చేర్చాలని ఆయన సూచించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని గుర్తించి తక్షణమే ఆశ్రయం, పునరావాసం కల్పించడంతోపాటు ఉచితంగా విద్యా, వైద్యం, వసతి కల్పించాలని ఆయన తెలిపారు. అధికారులు ప్రణాళికతో సమిష్టిగా పనిచేయాలని చేయాలని చెప్పారు. సమావేశంలో కమిటీ నోడల్ అధికారి, డీఆర్‌ఓపీ వెంకట రమణ, కార్మిక శాఖ సహాయ కార్మిక కమిషనర్ డి.వి. శివప్రసాద్, డీఈఓ టి.వి. రామారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి జె.రాజా దిబోరా, సీడబ్ల్యూసీ సభ్యులు దుర్గ భవాని పాల్గొన్నారు.

సీటీ, ఎంఆర్ఐ స్కాన్ సెంటర్ ప్రారంభం

బాపట్ల: జగనన్న బడుగు వికాసం పథకం కింద బాపట్లలో సీటీ, ఎంఆర్ఐ స్కాన్ సెంటర్ ఏర్పాటు చేయడం సంతోషదాయకమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బాపట్ల సీటీ, ఎంఆర్ఐ స్కాన్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ వైద్య సేవలకు అనుబంధంగా స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. జగనన్న బడుగు వికాసం పథకం కింద ప్రభుత్వం నుంచి రూ.2.95 కోట్లు స్కానింగ్ సెంటర్‌కు విడుదలయ్యాయని తెలిపారు. ఇందులో 45శాతం లబ్ధిదారుడికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, మిగిలిన రూ.1.70 కోట్లను బ్యాంక్ నుంచి రుణం మంజూరైనట్లు చెప్పారు. బాపట్ల వాసి డాక్టర్ పాలపర్తి మనోజ్ కుమార్ స్కాన్ సెంటర్ ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో టీఆర్‌ఓపీ వెంకట రమణ, ఆర్డీవో జి.రవీందర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఎస్. విజయమ్మ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మదన్‌మోహన్‌శెట్టి, మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, రేడియాలజిస్ట్ డాక్టర్ మధు సల్మాన్, డాక్టర్ మీనా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు విద్యార్థినుల ప్రాజెక్ట్ ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఇంకొల్లు (చినగంజాం): జాతీయ సైన్సు కాంగ్రెస్ ప్రదర్శనలో భాగంగా రాష్ట్రస్థాయి ప్రదర్శనకు గంగవరం విద్యార్థినుల ప్రాజెక్ట్‌లు ఎంపికయ్యాయి. చీరాల జాండ్రపేట బీవీ అండ్ బీఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 16న నిర్వహించిన జిల్లాస్థాయి 31వ జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఇంకొల్లు మండలంలోని వలేటి కృష్ణయ్య పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పెద్దపల్లి అంకిత, కట్టా సాహితి చేసిన ప్రాజెక్ట్ 'బుల్లెట్-మిల్లెట్స్' ప్రదర్శనలో ఉత్తమంగా ఎంపికయ్యాయి. కేఎల్ విశ్వవిద్యాలయం వడ్డేశ్వరంలో ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనలో విద్యార్థినులు పాల్గొంటారని హెచ్‌ఎం కె.వీరాంజనేయులు చెప్పారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రతిభ కనబరచిన విద్యార్థినులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయిని మేడికొండ సుమలతను పాఠశాల హెచ్‌ఎం, కరస్పాండెంట్ ఎం. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబుదే తప్పు

- పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆమంచి

పర్చూరు (చినగంజాం): స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ఎక్కడా తప్పు చేయలేదని చంద్రబాబు అనడం లేదని పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు తప్పు చేశారని, టీడీపీ నాయకులు కూడా ఆయన తప్పు చేయలేదని అనడం లేదన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీపై పురందేశ్వరి చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. చంద్రబాబు గురించి మాట్లాడేటప్పుడు ఆయన గత చరిత్ర గురించి తెలుసుకోవాలని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరరావు చంద్రబాబు గురించి పుస్తకం రాశారని, దాన్ని చదివిన అనంతరం పురందేశ్వరి మాట్లాడాల్సిందని సూచించారు. నాయకులు కఠారి అప్పారావు, అడపా సుధాకరరెడ్డి, ముప్పాళ్ల రాఘవయ్య, శివరాం, నూతలపాటి బలరాం, ఆకుల హేమంత్, జంగా అనిల్, గాదె సురేష్, షేక్ కాలేషా పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో ఆక్వాలో అధిక దిగుబడులు

రేపల్లె రూరల్: మత్స్యశాఖ అధికారుల సూచనలతో ఆక్వా రైతులు సాగులో సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పాటించి, అధిక దిగుబడులు సాధించాలని నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్(నాక్సా) సీఈఓ డాక్టర్ మనోజ్‌కుమార్ చెప్పారు. మండలంలోని తుమ్మల పంచాయతీ నిర్మల్‌నగర్‌లో ఎంపెడా ఆధ్వర్యంలో ఆక్వా రైతలకు శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రొయ్యలు, చేపల పెంపకంలో రైతులు యాంటీ మైక్రో బీఎల్స్‌ను అధికంగా వాడటంతో ఆక్వా రంగం కుదేలవుతోందని తెలిపారు. యాంటీ మైక్రో బీఎల్స్‌తో జరిగే ప్రమాదాల్ని రైతులకు వివరించారు. గ్రామ సర్పంచ్ తుపాకుల దీపిక మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో నిర్మల్ నగర్‌లో ఆక్వా సాగు ఆశాజనకంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపెడా జాయింట్ డైరెక్టర్ ఏ.జైయబాక్, ఫిషరీస్ ఏడీ సైదానాయక్, ఈ కోస్టల్ ఆక్వా కల్చరల్ అధికారి ఎం.రాంప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రశేఖర్, రీజినల్ కో-ఆర్డినేటర్ కిరణ్, నాక్సా స్టేట్ కో-ఆర్డినేటర్ సీహెచ్.ఎస్. పుష్పారావు పాల్గొన్నారు.